## 25లేదా 27న ఎప్‌సెట్ ఫలితాలు!

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ): టీఎస్ ఎప్‌సెట్ పరీక్షలు ఈ నెల 7న ప్రారంభం కాగా, శనివారంతో ముగిశాయి. ఈ నెల 25న లేదా 27న ఫలితాల విడుదలకు జేఎన్టీయూ అధికారులు సన్నాహకాలు చేస్తున్నారు. శనివారం మేడ్చల్ -మల్కాజిగిరి జిల్లా మైసమ్మగూడలోని మల్లారెడ్డి ఇంజినీరింగ్ పరీక్షాకేంద్రానికి ఇద్దరు విద్యార్థులు ఆలస్యంగా రావడంతో అధికారులు పరీక్షకు అనుమతించలేదు. శనివారం నిర్వహించిన ఇంజినీరింగ్ పరీక్షకు 94శాతం విద్యార్థులు హాజరైనట్టు కన్వీనర్ ప్రొఫెసర్ డీన్‌కుమార్, కో కన్వీనర్ ప్రొఫెసర్ కే విజయ్ కుమార్‌రెడ్డి తెలిపారు.

# రిజర్వేషన్ల రద్దుపై మోదీ స్పష్టత ఇవ్వాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య

ముషీరాబాద్, మే 11: రాజ్యాంగాన్ని రద్దు చేసి, ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లను తొలగిస్తారనే చర్చపై ప్రధాని మోదీ, బీజేపీ పెద్దలు స్పష్టమైన ప్రకటన చేయాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య డిమాండ్ చేశారు. జనగణన, కులగణన, బీసీల 50% రిజర్వేషన్ల కల్పన విషయంలో బీజేపీ వైఖరేంటో చెప్పాలని కోరారు. శనివారం హైదరాబాద్ విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఆయన మాట్లాడుతూ.. ఓట్లకోసం బీసీ ప్రధానీ అంటూనే బీసీలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపించారు. భారత మాత పేరిట అదానీ, అంబానీల ఖజానా పెంచడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. బీజేపీ నేతలు బీసీలను మభ్యపెట్టడం మాని 50 శాతం రిజర్వేషన్లు, ఉద్యోగ ప్రమోషన్‌లలో రిజర్వేషన్‌లు, బీసీ మంత్రిత్వ శాఖ, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్ల అంశంపై తమ విధానమేంటో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. బీజేపీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ఎక్కడా బీసీ సమస్యలపై ప్రస్తావించకపోవడం శోచనీయమని, పదేళ్ల మోదీ పాలనలో బీసీల అభివృద్ధికి ఒక్క పథకాన్ని ప్రవేశపెట్టలేకపోయిందని మండిపడ్డారు. రిజర్వేషన్‌ల ఎత్తివేత అంశంతోపాటు కులగణన విషయంలో బీజేపీ స్పష్టతనిస్తేనే ఆ పార్టీకి బీసీలు ఓట్లు వేస్తారని, లేని పక్షంలో ఓటుతో సమాధానం చెప్పక తప్పదని హెచ్చరించారు. వచ్చే జూన్, జూలై నెలల్లో బీసీ సమస్యలపై దేశవ్యాప్తంగా ఉద్యమం లేవదీస్తామని హెచ్చరించారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, నీల వెంకటేశ్, రాజేందర్, అనంతయ్య, నందకిశోర్, ప్రణీతారాణి తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీ ఆర్ కృష్ణయ్య

## • జూన్ 20నుంచి అంతర్జాతీయ టూరిజం సదస్సు

హైదరాబాద్, మే 11(నమస్తే తెలంగాణ): సినిమా, వెడ్డింగ్, హాస్పిటాలిటీ తదితర రంగాలకు సంబంధించిన వినూత్న ఎక్స్‌పరిమెంటల్ టూరిజం కాంక్లేవ్-24కు హైదరాబాద్ నగరం వేదిక కానున్నది. పర్యాటకరంగ అభివృద్ధిలో భాగంగా రాష్ట్ర పర్యాటకశాఖ, తెలంగాణ ఛాంబర్ ఆఫ్ కామర్స్ సంయుక్తాధ్వర్యంలో జూన్ 20 నుంచి 23వరకు హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీలో ఈ సదస్సును నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. జాతీయ, అంతర్జాతీయస్థాయి ప్రతినిధులు ఇందులో పాల్గొంటారని చెప్పారు.

## • 18న 'టౌన్‌ప్లానింగ్'కు వైద్య పరీక్షలు

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ): మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ డిపార్టుమెంట్‌లో టౌన్‌ప్లానింగ్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు ఈ నెల 18న వైద్య పరీక్షలు నిర్వహించనున్నారు. ఎంపికైన అభ్యర్థులు తప్పకుండా హాజరు కావాలని టీఎస్‌పీఎస్సీ కార్యదర్శి నవీన్ నికోలస్ శనివారం తెలిపారు.

## • బీజేపీ ఎంపీ నవనీత్ కౌర్‌పై కేసు నమోదు



సైదాబాద్, మే 11 : ఎన్నికల కోడ్ ఉల్లంఘన కింద మహారాష్ట్ర అమరావతి ఎంపీ నవనీత్ కౌర్ రానాపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ నెల 8న చంపాపేట లక్ష్మిగార్డెన్‌లో బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో హైదరాబాద్ బీజేపీ అభ్యర్థి మాధవీలతకు మద్దతుగా నిర్వహించిన ఎన్నికల సభలో నవనీత్ కౌర్ రానా వివాదస్పద వ్యాఖ్యలు చేశారు. 'విధుల్లో ఉన్న పోలీసులు పక్కకు తప్పుకొంటే ఒవైసీ సోదరులపై చర్యలకు 15 సెకన్ల సమయం చాలు' అంటూ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినందుకు ఆమెపై సైదాబాద్ పోలీసులు కేసు నమోదు చేశారు. యాకత్‌పురా అసెంబ్లీ సెగ్మెంట్ ఫ్లయింగ్ స్క్వాడ్ టీం ఇన్‌చార్జి రాకేశ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నవనీత్ కౌర్ రానాపై 505(2), 506,171(సీ),171(ఎఫ్),171(జి) సహ భారతీయ శిక్షాస్మృతిలోని వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశామని సైదాబాద్ ఇన్‌స్పెక్టర్ కే రాఘవేందర్ తెలిపారు. కాంగ్రెస్‌కు ఓటువేస్తే పాకిస్తాన్‌కు వేసినట్టేనని వ్యాఖ్యలు చేసిన ఆమెపై ఇదివరకే షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే.

# బీజేపీని క్రిస్టియన్లు ఓడించాలి

**క్రిస్టియన్ ఇంటెలెక్చువల్ ఫోరం తీర్మానం**

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ) : రాజ్యాంగాన్ని మార్చుతామని, రిజర్వేషన్లను సమూలంగా తీసేస్తామని చెబుతున్న బీజేపీని క్రిస్టియన్ మైనార్టీ సోదరులంతా కలిసి ఓడించాలని 'క్రిస్టియన్ ఇంటిలెక్చువల్ ఫోరం' పిలుపునిచ్చింది. శనివారం హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో 'భారత రాజ్యాంగం, రిజర్వేషన్ల రక్షణ కోసం గొంతు విప్పుదాం' అనే అంశంపై రాష్ట్ర క్రిస్టియన్ మేధావులు నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ప్రొఫెసర్ రాజేశ్ సొలోమాన్ మాట్లాడుతూ.. దేశంలోని అణగారిన, బలహీనవర్గాలకు న్యాయం చేసేందుకు ఆ దేవుడు పంపిన అభినవ ప్రవక్త డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. ఇక నుంచి ప్రతి చర్చిలో సండేస్కూల్ విద్యార్థులకు బైబిల్ బోధనలతో పాటు రాజ్యాంగం గురించి బోధించాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని పేర్కొన్నారు. దేశంలో అన్ని వర్గాలకు సమన్యాయం జరగాలంటే కచ్చితంగా రిజర్వేషన్ ఉండాల్సిందేనని డాక్టర్ అశిష్ చౌహాన్ అన్నారు. బీజేపీ పాలనలో క్రైస్తవులపై దాడులు విపరీతంగా పెరుగుతున్నాయని, అలాంటి సమయంలోనైనా రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉపయోగించుకోవాలని రిటైర్డ్ ఏడీజీ బాబురావు చెప్పారు. తర్వాత, క్రిస్టియన్లంతా కలిసి బీజేపీకి ఓటుతో బుద్ధి చెప్పాలని సమావేశం తీర్మానించింది. సమావేశంలో రిటైర్డ్ ఐపీఎస్ మధుకుమార్, సుధీర్, దాస్ యోనాతన్, ఉదయ్‌కాంత్, వివిధ చర్చిల పాస్టర్లు, క్రిస్టియన్ విద్యావంతులు, ఎన్ఆర్ఐలు తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లోని టూరిజం ప్లాజాలో మాట్లాడుతున్న ప్రొఫెసర్ రాజేశ్ సొలోమాన్

# 'విద్యుత్తు సిబ్బంది శ్రమను గుర్తించండి'

హైదరాబాద్, మే 11 (నమస్తే తెలంగాణ) : ఎండనకా.. వాననకా శక్తికి మించి రేయింబవళ్లు పనిచేస్తూ కోతల్లేకుండా విద్యుత్తునందిస్తున్న విద్యుత్తు ఇంజినీర్లు, సిబ్బంది శ్రమను వినియోగదారులు గుర్తించాలని తెలంగాణ పవర్ ఎంప్లాయీస్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీఎస్‌పీఈ జేఏసీ) కోరింది. సాంకేతిక కారణాలతోనే విద్యుత్తు అంతరాయాలు ఏర్పడుతున్నాయనే తప్ప, ఇందులో తమ నిర్లక్ష్యం ఏమీ లేదని జేఏసీ చైర్మన్ సాయిబాబా, కన్వీనర్ పీ రత్నాకర్‌రావు, కో చైర్మన్ శ్రీధర్, కో కన్వీనర్ బీసీరెడ్డి, పీ సదానందం స్పష్టంచేశారు. పలు మాధ్యమాల్లో విద్యుత్తు అంతరాయానికి సిబ్బందిని, ఇంజినీర్లను బాధ్యులను చేయడం తమను తీవ్రంగా కలచివేసిందని పేర్కొన్నారు. సిబ్బంది కొరత.. ఉష్ణోగ్రతల్లో మార్పులు.. విద్యుత్తు డిమాండ్ పెరిగిన నేపథ్యంలో విద్యుత్తు సిబ్బంది రెట్టింపు పనిభారంతో సేవలందిస్తున్న విషయాన్ని అంతా గుర్తించాలని విజ్ఞప్తి చేశారు. ప్రకృతి వైపరీత్యాలు, గాలివానలతో చెట్లకొమ్మలు విరిగిపడి అంతరాయం ఏర్పడుతుందని, ఈ క్రమంలో తక్షణమే విద్యుత్తు సరఫరాను పునరుద్ధరిస్తున్నామని తెలిపారు. వేసవి డిమాండ్ నేపథ్యంలో టీఎస్ఎస్పీడీసీఎల్ పరిధిలో 4,353 ట్రాన్స్‌ఫార్మర్లు అదనంగా ఏర్పాటు చేశామని, మరో 250 వరకు క్షేత్రస్థాయి కార్యాలయాల్లో అందుబాటులో ఉంచామని వివరించారు. ఈ వేసవిలోనూ కోతల్లేకుండా విద్యుత్తునందిస్తున్న సిబ్బందిని, ఇంజినీర్లను ఈ సందర్భంగా జేఏసీ నేతలు అభినందించారు.

# చేవెళ్ల డిక్లరేషన్ ఏమైంది?

- ఎస్సీ, ఎస్టీ, బీసీలు కాంగ్రెస్ ట్రాప్‌లో పడొద్దు
- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ



ఖైరతాబాద్, మే 11 : కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు పెంచుతామంటూ చేవెళ్ల డిక్లరేషన్‌లో ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట తప్పారని ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతతో కలిసి మాట్లాడారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం రద్దవుతుందని, రిజర్వేషన్లు తొలగిస్తారంటూ ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గేతో పాటు రాహుల్ గాంధీ, రేవంత్‌రెడ్డి గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రధాని మోదీ తాను జీవించి ఉన్నంత కాలం రిజర్వేషన్లు రద్దు కావని, రాజ్యాంగాన్ని మార్చమని బహిరంగంగా ప్రకటించారని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీలు కాంగ్రెస్ ట్రాప్‌లో పడొద్దని, ఈ ఎన్నికల్లో ఆ పార్టీని చిత్తుగా ఓడించి, బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చారు.

## • క్యాట్‌ఫిష్‌ను గుర్తించేందుకు ఈడీఎన్ఏ విధానం

*హైదరాబాద్ సిటీబ్యూరో, మే 11 (నమస్తే తెలంగాణ): జలావరణాన్ని, జలచరాలను పరిరక్షించేందుకు హైదరాబాద్‌లోని సెంటర్ ఫర్ సెల్యులర్ అండ్ మాలిక్యులర్ బయాలజీ (సీసీఎంబీ) సరికొత్త ఎన్విరాన్‌మెంటల్ డీఎన్ఏ (ఈడీఎన్ఏ) విధానాన్ని రూపొందించింది. దీన్ని తొలిసారి తూర్పు కనుమల్లో వినియోగించి అక్కడి జలవనరుల్లో చొరబడిన నిషేధిత క్యాట్‌ఫిష్ సంతతిని సమర్థంగా గుర్తించింది. మత్స్య సంపదకు తీవ్ర నష్టం కలిగించే క్యాట్‌ఫిష్‌ను సంప్రదాయ పద్ధతుల్లో గుర్తించడం కష్టం. అందుకే ఈ-డీఎన్ఏ విధానాన్ని సీసీఎంబీ డెవలప్ చేసింది. దీనిలో భాగంగా నీటిలోని నమూనాలను సేకరించి, అందులో ఉండే ఈడీఎన్ఏను ప్రత్యేక పద్ధతిలో వేరుచేస్తారు. అనంతరం క్యూపీసీఆర్ ఆంప్లికేషన్ పద్ధతిలో డీఎన్ఏను విశ్లేషించి క్యాట్‌ఫిష్ సంతతి ఏ స్థాయిలో ఉన్నదో తెలుసుకుంటారు. క్యాట్‌ఫిష్‌ను వేగంగా గుర్తించేందుకు ఈ విధానం ఎంతో దోహదపడుతుందని సీసీఎంబీ పరిశోధకులు చెప్తున్నారు.*



# చెల్లి పరీక్ష కోసం వెళ్తూ..

**రోడ్డు ప్రమాదంలో అక్క మృతి**

కరీమాబాద్, మే 11 : చెల్లిని పరీక్ష రాయించేందుకు తీసుకెళ్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో అక్క దుర్మరణం చెందింది. వరంగల్ జిల్లా కరీమాబాద్ ప్రాంతానికి చెందిన నాగపురి కాళి-సంధ్య దంపతులకు ఇద్దరు కుమార్తెలు నాగపురి తన్మయ్(23), సాయిహర్షిత ఉన్నారు. సాయిహర్షితను ఎప్‌సెట్ రాయించేందుకు తల్లి, పెద్ద కూతురు తన్మయ్‌తో కలిసి కారులో శనివారం హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈ క్రమంలో ఘట్‌కేసర్ సమీపంలో కారును డీసీఎం ఢీకొట్టడంతో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో నాగపురి తన్మయ్ (23) అక్కడికక్కడే మృతిచెందగా, మిగతా ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. ఈ ప్రమాదంతో కరీమాబాద్‌లో విషాదం నెలకొన్నది.



నాగపురి తన్మయ్ (ఫైల్)


